# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

## పచ్చని పంటల్లో 'కౌలుదారు' కుంపట్లు..!



- ప్రభుత్వ రికార్డుల్లోకి కౌలుదారు పేరు కూడా..
- యజమాన్య హక్కులకు ఎసరు పెట్టే ప్రమాదం
- ఆ చట్టంతో మళ్లీ దళారుల రాజ్యం
- అమల్లోకి వస్తే కూలీల ఉపాధి దెబ్బతినే ఛాన్స్
- కాంగ్రెస్‌పై దుమ్మెత్తి పోస్తున్న రైతులు

నల్లగొండ, నవంబర్ 23 : 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కౌలుదారు చట్టం తీసుకొస్తాం' ఇదీ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క స్వయంగా చేసిన కామెంట్. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రైతుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. ఈ చట్టం తీసుకొస్తే రైతులకు ఉరే గతి అని ఆందోళన చెందుతున్నారు. దాని ప్రకారం రైతులు తమ భూమిని కౌలుకు ఇస్తే కచ్చితంగా ప్రభుత్వ రికార్డుల్లో నమోదవుతుందని, దీంతో భూయజమాన్య హక్కులకే ఎసరు వచ్చే ప్రమాదం వస్తుందని గుబులు పడుతున్నారు. అంతేకాకుండా న్యాయంస్థానంలో నిలబెట్టే పరిస్థితి ప్రమాదం ఉంది. దీంతో పల్లెల్లో కౌలు చిచ్చు రాజుకోవడంతోపాటు ఊర్లలో ప్రశాంతత దెబ్బతింటుంది. రైతులు తమ భూములను కౌలుకు ఇవ్వడానికి వెనకాడుతారు. ఫలితంగా రైతులకు ఉపాధి మార్గాలు తగ్గడంతో పాటు ఉత్పత్తి, దిగుబడి తగ్గుతుంది. కౌలు చట్టం దళారీ రాజ్యానికి బార్లా తలుపులు తెరుస్తుంది. ఇలాంటి ప్రమాదకరమైన చట్టాన్ని కాంగ్రెస్ తీసుకొస్తామనడంతో రైతులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ప్రశాంతంగా ఉన్న రైతుల జీవితాల్లో కుంపట్లు పెడతారా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను గెలవనీయబోమని, కౌలుదారు చట్టం ఆలోచన ఆదిలో తుంచేస్తామని ఘంటాపథంగా చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడతామని, కాంగ్రెస్ అభ్యర్థుల డిపాజిట్లను గల్లంతు చేస్తామని శపథం చేస్తున్నారు.

### ఎనకటి పట్వారీలకు పెత్తనమిస్తే మా బతుకులు ఆగమే..



కాంగ్రెస్ వాళ్లు ధరణి రద్దు చేసి పాత పటేల్, పట్వారీ వ్యవస్థ తెస్తానంటున్నారు. గతంలో పట్వారీ వ్యవస్థలో భూముల సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడ్డం. వీఆర్వోల వెంట కాళ్లరిగేలా తిరిగినం. ఏండ్ల తరబడి వీఆర్వోలు, దళారుల వెంట తిరగడానికే సరిపోయేది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంక ధరణి తీసుకు రావడంతో రైతుల బాధలు తీరినై. భూముల రికార్డులన్నీ ఆన్‌లైన్‌లోనే కనిపిస్తున్నయ్. భూములు అమ్మినా, కొన్నా గంటల టైమ్‌లోనే పని పూర్తి చేస్తున్నరు. వెంటనే మ్యూటేషన్ కూడా చేస్తున్నరు. పట్టాదారు పాస్‌బుక్ కూడా వెంటనే ఇస్తున్నరు. దాంతో రైతులు ప్రశాంతంగా ఉంటున్నరు. గప్పటి పరిస్థితి మళ్లీ వస్తే భూముల పట్టాలు ఆగమవుతై. మళ్లీ పట్వారీలకు పెత్తనమిస్తే మా బతుకులు ఆగమే. లేని పంచాయితీ పెంచుకోవడమే అవుతుంది. గతంల రిజిస్ట్రేషన్ దగ్గర నుంచి, మ్యూటేషన్ వరకు ప్రతి పనికి లంచం ఇవ్వాల్సి వచ్చేది. ఇక పట్టా పాస్‌బుక్ రావాలంటే వీఆర్వోలు, తాసీల్దార్ల దయమీద ఆధార పడాల్సి వచ్చేది. మా ఊర్లో అప్పట్లో భూములు కొన్నోళ్లకు మ్యూటేషన్ చేస్తానని లంచం తీసుకొన్న వీఆర్వోలు 7 నంబర్ ఫారం రాయకుండానే పట్టాపాస్‌బుక్‌లు ఇచ్చినరు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో చూస్తే అమ్మినవారి పేరే ఉంది. ధరణి వచ్చినంక ఇలాంటి సమస్యలు తీరినై. కాంగ్రెస్ పార్టీ వాళ్లు మళ్లీ పాత పద్ధతే తెస్తానంటున్నరు. పట్టా పుస్తకంలో కౌలు రైతుల పేర్లు ఇస్తే వారితో పట్టా రైతుల పంచాయితీ మొదలవుద్ది. రైతులు ప్రశాంతంగా ఉండడం కాంగ్రెసోళ్లకు ఇష్టం లేనట్లుంది. వారి మాటలు నమ్మి గెలిపిస్తే మళ్లీ మా బతుకులు ఆగమైతయ్. ధరణి తెచ్చిన సీఎం కేసీఆర్‌కే మేమంతా మద్దతిస్తాం.

–కందుల నాగిరెడ్డి, రైతు, దామరచర్ల, (మిర్యాలగూడ రూరల్)

### రైతులను నిలువునా ముంచేందుకే కౌలుదారు విధానం



ధరణి తీసేసి కౌలుదారు విధానం తీసుకొస్తామని, రికార్డుల్లో అనుభవదారు కాలం పెడతామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొనడం రైతులను నిలువునా ముంచే కుట్రే. కౌలు రైతు పేరును అనుభవదారుడి చేరిస్తే పట్టాదారుడి భూమిపై హక్కు ఇచ్చినట్లే అవుతుంది. తెలంగాణ వచ్చినంక రైతులు మంచిగ బతుకుతున్నరు. ధరణి రావడంతో రైతులకు తిప్పలు తప్పినై. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో వ్యవసాయ భూములు భద్రంగా ఉన్నాయి. కాంగ్రెస్ వాళ్లు రైతులను నిలువునా ముంచడం కోసమే ధరణి రద్దు చేస్తామంటున్నరు. మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తే దళారుల ప్రమేయం పెరిగి రైతుల భూములు మాయమయ్యే ప్రమాదం ఉంటుంది. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణే బాగుంది. మేమందరం దానికే మద్దతు తెలుపుతాం.

– రేకల భిక్షం, రైతు, ఇస్మాయిల్‌పల్లి, కట్టంగూర్



### కౌలుదారు చట్టంతో నిత్యం సమస్యలే

కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన కౌలు చట్టంతో పట్టాదారులకు నిత్యం తిప్పలే ఎదురవుతై. భూమి యజమానితో పాటు కౌలు రైతులకు కూడా హక్కులు కల్పిస్తే ఇద్దరికీ నిత్యం గొడవలే. భూములు ఉన్న వాళ్లు వేరే ఊర్లో ఉంటే తమ భూమి కౌలుకిస్తరు. దానిని సాగు చేసుకోవడం ద్వారా చిన్న, సన్నకారు రైతులు బాగుపడుతున్నరు. కాంగ్రెస్ వాళ్లు చెప్పే కౌలు చట్టంతో అసలు భూములు కౌలికిచ్చేందుకు రైతులే ముందుకు రారు. దాంతో చిన్న రైతులు భూములు లేక సాగుకు దూరమవుతరు. కౌలు చట్టాన్ని పట్టాదారు లెవరూ అంగీకరించరు సరికదా ఆ చట్టం తెస్తామన్న కాంగెస్‌ను పాతరెస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ చాలా బాగుంది. ఎవరి భూమి వారి పేరుమీద భద్రంగా ఉంది. వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంచుతున్నరు. ఎక్కడి నుంచైనా మా భూముల వివరాలు చూసుకునేందుకు అవకాశం ఉంటుంది. ధరణి రద్దుచేస్తే పట్టాదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే రైతులందరూ ధరణి తెచ్చిన బీఆర్ఎస్‌కే మద్దతు తెలుపుతున్నరు.

– గంగలి పర్వతాలు, గొట్టిముక్కల, దేవరకొండ రూరల్

### పట్టాదారులను ఇబ్బంది పెట్టాలనే కాంగ్రెస్ కుట్ర




ధరణి తీసేసి పాత చట్టాలను మళ్లీ తీసుకొస్తే గతంల రైతులు పడ్డ బాధలు మళ్లీ పడాల్సి వస్తది. తరాల నుంచి రైతులు భూములను కౌలుకు ఇస్తున్నరు. పట్టాదారు కౌలు రైతుకు అగ్రిమెంట్ రాసివ్వడమనేది ఎప్పుడూ లేదు. ఈ చట్టాన్ని తెస్తానని కాంగ్రెస్ వాళ్లు చెప్పడం కబ్జా దారులను ప్రోత్సహించడమే అవుతుంది. రైతులు, కౌలు దారులు నిత్యం గొడవలు పడాలనే ఆ పార్టీ నాయకులు కుట్రలు పన్నుతున్నరు. ఇన్ని సంవత్సరాల నుంచి కౌలు రైతులు అగ్రిమెంట్ లేకుండా భూములు తీసుకొని వ్యవసాయ చేయట్లేదా.. మళ్లీ ఇప్పుడెందుకు కొత్త మాటలు. ఇప్పటి వరకు కౌలుదారుకు, పట్టాదారుకి మధ్య స్నేహ సంబంధాలున్నయ్. కౌలు చట్టంతో ఇద్దరి మధ్య మధ్య చిచ్చుపెట్టి వ్యవసాయాన్ని దెబ్బతీసేందుకే కాంగ్రెస్ కుట్ర చేస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ధరణి పోర్టల్ బాగుంది. దీంతో ఎలాంటి గొడవలూ లేవు. ధరణి పోర్టల్‌తో నిజమైన పట్టాదారులకే హక్కు ఉండేలా బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయం. రైతుల సంక్షేమం కోసం పాటు పడే బీఆర్ఎస్ వైపే రైతులు ఉంటరు తప్ప రైతులను ఇబ్బంది పెట్టే కాంగ్రెస్ లాంటి పార్టీల వైపు ఎవరూ ఉండరు.

– జెర్రిపోతుల విష్ణు, రైతు, వేములపల్లి

---

రైతుల పచ్చని జీవితాల్లో కాంగ్రెస్ మంటలు రేపే కుట్ర చేస్తున్నది. ప్రశాంతంగా జీవిస్తున్న అన్నదాత కడుపుకొట్టే కుయుక్తులు పన్నుతున్నది. దేశానికే బువ్వగిన్నెగా మారిన తెలంగాణను ఆగం చేసే పన్నాగం పన్నుతున్నది. 24 గంటల కరెంట్ వద్దని, 3 గంటల కరెంట్ చాలని సల్లని చావు కబురు చెబుతున్నది. 10హెచ్‌పీ మోటర్లు బిగించుకోవాలని.. ఎద్దు, ఎవుసం గురించి తెలియకుండా ఉచిత సలహాలు ఇస్తున్నది. అసలు రైతుల వద్ద 10హెచ్‌పీ మోటర్లే ఉండవనే సోయి లేకుండా కాంగ్రెస్ నేతలు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నది. రైతుల ఉపయోగించేవి 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లు అనే విషయం తెలియకుండా కారుకూతలు కూస్తున్నది. ఇట్లయితే ఉమ్మడి రాష్ట్రంలో లెక్క మళ్లీ మోటర్లు కాలుడు, ట్రాన్స్‌ఫార్మర్లు పేలుడు కథే ఉంటదని రైతులు భగ్గుమంటున్నారు. 10హెచ్‌పీ మోటర్లు కొంటే ఒక్కొక్కరిపై రూ.లక్షకు పైగా ఆర్థిక భారం ఎవరు భరిస్తారని ఆందోళన చెందుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో 24గంటల నాణ్యమైన కరెంట్ వస్తుందని, అలాంటి మంచి పాలనను ఎట్ల వదులుకుంటామని చెబుతున్నారు.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ)




# కాంగ్రెస్‌ను బొంద పెడ్తం

## 10హెచ్‌పీ మోటర్ల పేరెత్తితే భగ్గుమంటున్న అన్నదాత



### కాంగ్రెసోళ్లు వద్దు.. వాళ్ల కరెంటూ వద్దు

గతంల కాంగ్రెస్ పాలనలో కరెంటు కోసం నానా అవస్థలు పడ్డం. అ బాధలు ఇప్పటికీ మర్చిపోలేదు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంటు చాలంటూ మాట్లాడుతున్నడు. 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలంట. మరి ఎవరు కొనిస్తరో ఆయనే చెప్పాలె. తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు ఇస్తుండడంతో సాగుకు ఢోకాలేకుండా పోయింది. ఏ బాధ లేకుండా పంటలు పండించుకుంటున్నం. పంట చేతికి రాగానే గవర్నమెంటే వెంటనే కొంటున్నది. మాకైతే ఏం ఇబ్బంది లేదు. మరి మూడు గంటల కరెంటిచ్చే కాంగ్రెస్ మాకెందుకు. కాంగ్రెసోళ్లు ఎప్పుడైనా రైతల దగ్గరికి పోయి వాళ్ల బాధలేందో చూస్తే తెలుస్తది. గప్పట్ల కాంగ్రెస్ గవర్నమెంట్ ఉన్నప్పుడు మధ్యరాత్రి కరెంటు వస్తే బాయికాడ పండుకొని మోటర్లు పెట్టుకున్న రోజులు చాలా ఉన్నయి. గిప్పుడు మాకు తీరినప్పుడు పోయి మోటరు పెట్టుకుంటున్నం. కరెంటు కోసం బాయికాడ ఎదురు చూసే రోజులు ఎప్పుడో పోయినై. సీఎం కేసీఆర్ చలువతో రైతులం మంచిగ బతుకుతున్నం. మాకు కాంగ్రెసోళ్లు వద్దు.. వాళ్లిచ్చే మూడు గంటల కరెంటూ వద్దు. రైతులందరం కేసీఆర్ సార్‌ను గెలిపించుకుంటం.

– అబ్బగోని నాగయ్య, రైతు, ఓగోడు, నకిరేకల్ మండలం.

### 3 గంటల కరెంట్‌తో సాగు చేసేదెట్లా



ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం సాగుకు 24 గంటల కరెంట్ ఇవ్వడం వల్ల పంటలు ఎండిపోకుండా సాగుకు సరిపడా నీరందుతున్నాయి. మాకు వీలైనప్పుడు వెళ్లి పొలానికి నీళ్లు పెడుతున్నం. కాంగ్రెస్ హయాంలో కరెంట్ ఎప్పుడొస్తదో, ఎప్పుడు పోతదో తెలియకుండా ఉండే. రాత్రిళ్లు నిద్ర మానుకొని కరెంట్ ఎప్పుడొస్తదో అంటూ పొలం వద్ద ఎదురు చూస్తూ ఉండేటోళ్లం. పొలానికి సరిగా నీరందక సగం పొలం ఎండిపోయేది. కనీసం పెట్టుబడి కూడా ఎల్లకుండా ఉండే. ఇప్పుడు ఆ బాధలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కావాల్సినంత కరెంట్ ఉంటుంది. చిన్న, సన్నకారు రైతులకు పంట పెట్టుబడికి సీఎం కేసీఆర్ రైతుబంధు ద్వారా డబ్బులు సాయం చేస్తున్నడు. దాంతో రైతుల జీవితానికి భరోసా దొరికింది. సీఎం కేసీఆర్ స్వయంగా రైతు కాబట్టే మా బాధలు తెలుసుకొని సాయం చేస్తున్నడు. దాంతో మేము బాగుపడడంతో పాటు పది మందికి పని కల్పిస్తున్నాం. ఇప్పుడు కాంగ్రెసోళ్లు వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలు.. 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలంటూ చెబుతున్నరు. వాళ్లకు వ్యవసాయం గురించి తల, తోక తెలియదు. అందుకే ఇలాంటి మాటలు మాట్లాడుతున్నరు. వాళ్లిచ్చే మూడు గంటల కరెంట్ వద్దు, వాళ్లు వద్దు. బీఆర్ఎస్ ప్రభుత్వానికే మేము మద్దతిస్తాం.

– కొత్త శౌర్రెడ్డి, రైతు, అడవిదేవులపల్లి

### రైతులు బాగుపడడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదు



రైతు బాగుపడడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదు. అందుకే సాగుకు 24 గంటలు వద్దు మూడు గంటల కరెంట్ చాలంటూ రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నడు. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇవ్వడంతో 5 హెచ్‌పీ మోటర్లు పెట్టి పొలానికి సరిపోయేంత నీటిని పెట్టుకుంటున్నం. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతయ్. మూడు గంటలే ఇస్తే అదే సమయంలో అందరూ మోటర్లు ఆన్ చేస్తే సబ్‌స్టేషన్‌పై భారం పడి అందులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు కూడా కాలిపోతయ్. బోర్లల్ల నీళ్లు కూడా కిందికి పోతయ్. ఇగ మళ్లీ మేమే ఆగమవుతం. ఇప్పుడున్న బీఆర్ఎస్ సర్కారు 24 గంటల కరెంట్ ఇస్తుండడంతో రైతులు ఎప్పుడు టైం దొరికితే అప్పుడు మోటర్లు పెట్టుకుంటున్నరు. దాంతో లోడ్ ఒకే సారి పడడం లేదు. మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతలేవు. బీఆర్ఎస్ ప్రభుత్వం సరిపోను కరెంట్ ఇస్తుండడంతో రైతులు హాయిగా వ్యవసాయం చేసుకుంటున్నరు. ఈ కాంగ్రెస్ వాళ్లను నమ్మితే మళ్లీ ఆగమవుతం. అందుకే బీఆర్ఎస్‌కే మద్దతిస్తం.

–అల్లుబెల్లి నాగిరెడ్డి, రైతు, మాధఎడవెల్లి, నార్కట్‌పల్లి మండలం.

### 3 గంటల కరెంట్ ఇస్తామనడం సరికాదు



నేను ఒక రైతుతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను. వానకాలం సీజన్‌లో రెండు బోర్ల కింద 6 ఎకరాల్లో వరిసాగు చేశాను. ప్రస్తుత ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇవ్వడం వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటలు పండినై. వ్యవసాయానికి 3 గంటల విద్యుత్ సరిపోతదని, 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకుంటే గంటలోనే ఎకరం పొలం పారుతదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పడం ఆయన అవివేకం. 3 గంటల్లోనే ఎకరం పొలం పారాలని 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకుంటే ఏం లాభం. భూమిలోని నీరంతా ఒకే సారి తోడుకుంటే ఆ తర్వాత సాగు ఎట్లా. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ఆలోచన మార్చుకోవాలి. వ్యవసాయానికి సీఎం కేసీఆర్ ఇస్తున్నట్లు 24 గంటల కరెంట్ ఇవ్వడమే కరెక్ట్. ఎన్ని హెచ్‌పీల మోటర్ పెట్టుకోవాలనే నిర్ణయం రైతులకు వదిలేయాలి. అలా కాకుండా వారు తమ ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే రైతులు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించడం ఖాయం.

– రిక్కల కరుణాకర్‌రెడ్డి, రైతు, మదారిగూడెం, అనుముల మండలం.



### 10 హెచ్‌పీ మోటర్లతో రైతులకు తిప్పలే

రైతులు 10 హెచ్‌పీ మెటర్లు పెట్టుకోవాలంటూ కాంగ్రెస్ నాయకులు చెప్పడం సరికాదు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. రైతులందరూ 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లే వాడుతరు. గతంలో ఉదయం 3 గంటలు, రాత్రి 4 గంటల కరెంటు ఇచ్చేటోళ్లు, అది కూడా వచ్చిపోతుండడంతో మెటార్లు ఎప్పుడూ కాలిపోయేవి. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇస్తుండడంతో మోటర్లు కాలిపోవట్లేదు. మళ్లీ ఇప్పుడు కాగ్రెస్ వాళ్లు 3 గంటల కరెంట్ ఇస్తం, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటున్నరు. అలాంటి పరిస్థితే వస్తే మోటర్లు మాటి మాటికి కాలిపోయి పంటమీద వచ్చిన ఆదాయం మోటర్ల రిపేర్లకే సరిపోద్ది. మాటి మాటికి మోటర్లు రిపేర్‌కు వస్తే రైతులకు మాపై నమ్మకం పోయి మేము కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24గంటల కరెంట్‌తో రైతులు చిన్న మోటర్లతో బ్రహ్మాండంగా సాగు చేసుకుంటున్నారు. అందుకే ప్రస్తుతం సంవత్సరానికి ఒకటి, రెండు సార్లు మాత్రమే మైనర్ రిపేర్లు వస్తున్నాయి. తక్కువ కరెంట్‌తో ఎక్కువ హెచ్‌పీ మోటర్లు వాడడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంటే కరెక్ట్.

– రావుల శ్రీను, మోటర్ మెకానిక్, తుంగతుర్తి, పెద్దవూర మండలం